
బస్సు కండక్టర్లందరూ ఒకే రకంగా ఉండరు. ఆర్.టి.సి. బస్సు కండక్టర్లయితే మరీ విడ్డూరం. వారిలో అసలు వర్గ చైతన్యమే కనిపించదు. ఒక్క విషయంలో మటుకే వీరిది సమభావన.



# బస్సులో భామ(వ) విప్లవం

- ఆర్. యస్. కె. మూర్తి

**జా**తీయం చేసిన బస్సులెక్కే ప్రయాణీకులకూ, తమకూ మధ్య ఉండేది ఎలుకా పిల్లీ సంబంధమనేది వీరి ఉమ్మడి నమ్మకం. ప్రయాణీకుల ప్రాణ సంకటాలకు వీరు పిల్లుల్లా సరదా పడి పోతుంటారు. నేనెక్కిన బస్సు కండక్టరు అచ్చం ఆ బాపతే.

బస్సు వచ్చి శ్రీకాకుళం శ్రీ మహావిష్ణువు ఆలయం ముందు ఆగింది. అదో షటిలు సర్వీసు. అక్కడికి ముప్పావు గంట దూరంలో ఉన్న చల్లపల్లి దాని గమ్యం. చార్జి 250 పైసలు.

"చిల్లర ఉన్నవాళ్లే బస్సు ఎక్కండి. లేకపోతే దిగిపోండి" కండక్టరు సాబ్ ఆర్డరు జారీ చేసేశారు మన్మోహన్ సింగ్‌గారు పంచిపెడుతున్న డాలర్లకు తాను చిల్లర తేలేనని ధ్వనిస్తూ, ఆగిన బస్సులోకి హడావుడిగా ఎక్కుతున్న ఐదారు పుంజీల ఆడామగా ప్రయాణీకుల్ని ఉద్దేశిస్తూ.

సమయం - సాయంత్రం ఏడు గంటలు పైమాటే. శ్రీ మహావిష్ణువు గుడి ముందు కొబ్బరి కాయల కొట్టు కూడా లేదు - చిల్లర తెచ్చుకోడానికి. అక్కడున్నదే ఒక బీడీల కొట్టు. అవి కొంటే గాని కొట్టువాడు చిల్లర ఇవ్వడు. ఎడ పిల్లతో ప్రయాణం చేస్తున్న ఆమె, పాపం, బీడీలేం చేసుకుంటుంది. చిల్లర లేకుండానే చిన్నదాన్ని చంకనేసుకొని బస్సు ఎక్కేసిందామె శ్రీ మహావిష్ణువుదే భారమన్నట్లు.

భూనభోంతరాలు బ్రద్దలైపోతాయని పించింది కండక్టరు సాబ్ పెట్టిన కేకకు. పది రూపాయల నోటిచ్చిన ఆ పిల్ల తల్లి మీది ఆగ్రహంతో. ఆమె ప్రదర్శించిన ఆజ్ఞా ధిక్కారాన్ని సైపలేక పోయాడా ప్రజా సేవకుడు! అక్కడికక్కడే బస్సు ఆపించేస్తాను, దిగి పొమ్మంటాడాయన ఆ ఎలిక ప్రాణిని.

ఆమె దిగవలసింది ముప్పావు గంట తర్వాత వచ్చే చల్లపల్లిలో కాదు. మధ్యలోనే పావుగంటా, ఇరవై నిమిషాలలో వచ్చే, ఒక ఊరి హరిజన వాడ స్టాపులో. ఆ స్టాపు రాంగానే బస్సు యింజనే ఆపు జేయించారు కండక్టరు సాబ్. వెళ్లి చిల్లర తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు, పిల్ల తల్లిని. నిలువు టుద్యోగమ్ చేస్తున్నదామె, ఈ పావుగంటగా - చిల్లర లేకుండా బస్సు ఎక్కినందుకు శిక్షగా.

'పది నోటియ్యి బాబూ, ఎల్లి చిల్లర తెస్తాను.' అర్థించిందా ఆడ మనిషి, ఎలక గొంతుతో. అక్కడున్న కాఫీ హోటల్ వైపు జూపిస్తూ.

"నో. కుదర్దు. వెళ్లి రూపాయి ముప్పావలా తెచ్చిచ్చి పదినోటు పట్టుకెళ్లు."

"నోటు లేకుండా ఆల్లెట్టా చిల్లరిస్తారు బాబూ. నోటియ్యండి. చిల్లర తెస్తాను."

"నో. కుదర్దు. ఇవ్వాళే మాకో దొంగ... గుణ పాఠం నేర్పిందిలే. వెళ్లి తీసుకురా."

"వెళ్లి తీసుకు రావమ్మా. అవతల మళ్లీ మాకు బందరు బస్సందదు" ఉచిత సలహా ఇచ్చారు తోటి ఆడ ప్రయాణీకులు సహకార భావంతో!

"నోటు లేకుండా చిల్లరెట్టా యిత్తారమ్మా. నేనేమన్నా అగెత్తి పోతానా?

ఆమె గొంతులో కంగారు స్థానంలో కూసింత కరుకుదనం. కాస్తంత నిరసన. అంతగా అయితే పిల్లదాన్ని యిడనే కూకో పెట్టుకోండి."

"నో కుదర్దు. నీ పిల్లదాన్ని నేనేం చేసు కుంటాను. మెడకు కట్టుకో మంటావా?"

అయిపోయింది. శిశుపాలుడు నూట ఒకటవ తప్పు చేసేసి నట్లయింది. భామ విప్లవిస్తుందా - ఈ బస్సులో. చెంప చెళ్లు మంటుందా కండక్టరు సాబ్‌కు? ఆమె ముఖంలో నాకేదో విప్లవ జ్యోతులు కన్పించినట్లయింది. అంతలోనే ఏదో సంస్కారం ఆమెను ఆవరించుకున్నట్లయింది.

గొంతు మటుకు ఖంగుమనే అన్నది "నోటికొచ్చినట్టు మాటాడకయ్యోయ్. మర్యాద గుండదు. సరే కూకో. బస్సాపుకొని యాడనే కూకో. నేనూ కూకుంటాను" పిల్లదాన్ని ఒళ్లో వేసుకొని, దర్జాగా సీటులో కూర్చున్నదామె.


భామ విప్లవం మౌన సత్యాగ్రహానికి స్థానమిచ్చి నట్లయింది.

"ఇదిగో కండక్టరు బాబూ. ఆ నోటు ఆమెకిచ్చేయ్. నీ రూపాయి ముప్పావలా నేనిచ్చే స్తాను." అందామనుకున్నాను నేను. అదేమంత పెద్ద మొత్తం కాదు నా దృష్టిలో. పాపం, ఆడ కూతురు. ఆమెను ఇరకాటంలో పెట్టేస్తున్నాడీ పురుష సింహం. మనమే ఆదుకుందాం పోనీ అన్న భావ విప్లవమేదో నాలో కలిగినట్లయింది. అట్లా అప్పుడప్పుడు సాటి వారిని ఆదుకుందామని అనిపిస్తూ ఉంటుంది నాకు. కాని అంతలోనే ఏదో మొహమాటం మరేదో ఇరకాటం. మనసులో కలిగిన మంచి భావాలను ఆచరణలోకి తేలేని అసమర్థతలో పడిపోయాను.

ఇంతలో డ్రైవరు బాబు జోక్యం చేసుకున్నాడు. ఒటేలాయన్ని కేకెట్టాడు. ఆమెకు చిల్లర రూపాయి ముప్పావలా యివ్వమని ఆదేశించాడు. తానే అందుకొని ఆమె చేత కండక్టరు సాబ్‌కు ఇప్పించాడు.

పది నోటు పుచ్చుకొని, పిల్లదానిని చంక నెత్తుకొని దిగిపోయిందా విప్లవ వీరురాలు.

"అమ్మయ్య" అని సేద తీరింది నా మనస్సు అది లోనైన భావ విప్లవపు తాకిడి నుంచి. ○



**ఎంక్వయిరీ**

ఇనెస్పెక్టర్ అన్నాడో వ్యక్తితో.

"జేబు దొంగ జగ్గారావుకు మీ అమ్మాయి నిచ్చి పెళ్లి చేయాలంటే అందుకు నా దగ్గర సలహా ఎందుకు?"

"వాడి రాబడి ఎంతో మీకు తెలుస్తుంది కదా"

**కె.వి.మధుసూదనరావు** (కాకినాడ)

